## మహావీర్ చారిటబుల్ ట్రస్ట్ రెడ్ క్రాస్‌కు 20 బెడ్స్ వితరణ



**నెల్లూరు, డిసెంబర్ 15, ప్రభాతవార్త –వైద్యం :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా శాఖ, తలసేమియా సెంటర్‌లో ,పిల్లల కొరకు శ్రీ భగవాన్ మహావీర్ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ జె.పి జైన్,జైన్ అసోసియేషన్ సభ్యులు శ్రీ ధర్మేంద్ర జైన్, కమలేష్ జైన్ తదితరులు 20 బెడ్స్ ను విరాళంగా అందచేశారు. ఈ సందర్భంగా జె.పి జైన్ మాట్లాడుతూ , తలసేమియా పిల్లలకి బెడ్స్ ఇవ్వడం చాలా సంతోషాన్ని ఇచ్చినదని, రాబోవు రోజులలో కూడా వారి ట్రస్ట్ తరపున సహాయ సహకారాలని అందచేస్తామని తెలియచేసారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఛైర్మన్ శ్రీ వాకాటి విజయ కుమార్ రెడ్డి, వైస్ ఛైర్మన్ శ్రీ చమర్తి జనార్ధన్ రాజు మేనేజింగ్ కమిటీ సభ్యులు శ్రీ బయ్యా ప్రసాద్, దాసరి రాజేంద్ర ప్రసాద్, తలసేమియా ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ సీత, సేవ ఎగ్జికూటివ్ మెంబర్ శ్రీమతి షేక్ పర్వీన్, బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్స్బ్రీ. వర ప్రసాద్ సిబ్బంది,లైఫ్ మెంబర్స్ పాల్గొన్నారు.

## పంట సాగు పై రైతులకు అవగాహన



**పొదలకూరు, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** పొదలకూరు సబ్ డివిజన్ పరిధిలోని పొదల కూర్ మండలంలో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులతో చర్చ కార్యక్రమం సోమ వారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొదల కూరు సహాయ వ్యవసాయ సహాయకులు కె.శివనాయక్ మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజనుకు సంబంధించి సాగులోని పంటల యాజమాన్యం గురించి తెలిపారు. ప్రస్తుతం అధిక యూరియా వాడకం వలన అనర్థాలు తెలిపి, అధికంగా రసాయన మందులు వాడకం వలన కాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు అధికమవుతున్నందున రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి అని ఆయన తెలిపారు. అదే విదంగా ఈ కార్యక్రమంలో పొదలకూర్ పరిశోధన స్థానం శాస్త్రవేత్త షేక్.హసీనా బాను మాట్లాడుతూ అపరాల పంట సాగులో ప్రస్తుతం చీడపీడలకు సంబంధించి యాజమాన్యం పద్దతులను తెలిపారు. పొదలకూరు మండల వ్యవసాయ అధికారి వి.ప్రతాప్ మాట్లాడుతూ వరి పంట నారుమడి యాజమాన్యం, సాగు విధానం రైతులకు తెలిపారు. ఉద్యానవన అధికారి ఆనంద్ మాట్లాడుతూ నిమ్మపంటలో అధికముగా బయో సంబంధిత మందులు వాడరాదు అని తెలిపి వాటి వలన మొక్క జీవిత కాలము తగ్గే అవకాశం ఉన్నది అని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు అడిగిన ప్రశ్నలకు శాస్రవేతలు, వ్యవసాయ శాఖ సిబ్బంది క్లుప్తంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మనుబోలు, కలువాయ మండల వ్యవసాయ అధికారులు వెంకట కృష్ణయ్య, కళ రాణి, జ్యోత్స్న వ్యవసాయ విస్తరణ అధికారులు రాజ మోహన్ రెడ్డి, నాగరాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు చింత మౌనిక, గ్రామస్తులు వెంకట రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రమణారెడ్డి, సూర్య నారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ విద్యార్థులచే ట్రీ ప్లాంటేషన్



**బిట్రగుంట డిసెంబర్ 15 ప్రభాతవార్త** : బోగోలు మండలం కడనూతల గ్రామంలో గల రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థిని విద్యార్థులు స్పెషల్ క్యాంపులో భాగంగా ఆరవ రోజు సోమవారం కొండ బిట్రగుంట దేవాలయం ప్రాంతంలో, పాఠశాల ప్రాంతంలో, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పివిఎన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకం వల్ల గాలి శుద్ధి, పర్యావరణ సమతుల్యత, మానసిక ఆరోగ్యం మెరుగుపడటం, నేల కోత నివారణ, వన్యప్రాణులకు ఆవాసం వంటి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయనీ; ఇవి మనకు ఆక్సిజన్ అందించి, ఒత్తిడిని తగ్గించి, జీవవైవిధ్యాన్ని ప్రోత్సహించి, ఆరోగ్యకరమైన జీవితానికి దోహదపడతాయనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఏ కిరణ్ కుమార్, గ్రామస్తులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## ఏకగ్రీవంగా మహిళా విభాగం వెంకటాచలం ఎన్జీజీవోస్ ఎన్నిక



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని వెంకటాచలం తాలూకా మహిళా విభాగం చైర్ పర్సన్‌గా ఎన్.సునీత, కో చైర్ పర్సన్‌గా వి. రాధాప్రసన్న, వైస్ చైర్ పర్స న్స్‌గా పి.స్పందన, ఎస్కె అఫ్రోజ్, జే. సుహాసిని, వి. శకుంతల, కన్వీనర్‌గా ఎస్కె సమీన, కో కన్వీనర్‌గా ఎస్కె మెహర్తాజ్, జాయింట్ కన్వీనర్స్‌గా కె. స్రవంతి, పి.సోనియా, ఎస్.కె. షెహనాబేగం, ఏ. రాజేశ్వరి, ట్రెజరర్ గా పిసునీత ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఈ ప్రక్రియ వెంకటాచలం తాలూకా అధ్యక్షులు ఎ. పార్థసారధి రెడ్డి, అధ్యక్షతన జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఈ. కరుణమ్మ, పరిశీలకులుగా మహిళా విభాగం రాష్ట్ర వైస్ చైర్ పర్సన్ కె. స్వర్ణలత, జిల్లా చైర్ పర్సన్ యు. చిన్నమ్మ, కన్వీనర్ ఎల్. నవోదయ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీజీవోస్ వెంకటాచలం, తాలూకా కార్యవర్గ సభ్యులు, తాలూకాలోని అన్ని శాఖల మహిళా ఉద్యోగినులు పాల్గొన్నారు.

## వన్ మంత్ వన్ విలేజ్ కార్యక్రమంతో

### రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం – తోటపల్లి గూడూరు తహశీల్దార్ సుధీర్



**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 15, ప్రభాతవార్త** : గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా వన్ మంత్ – వన్ విలేజ్, ఫోర్ విజిట్స్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తోటపల్లి గూడూరు తహశీల్దార్ సుధీర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం మండల వ్యాప్తంగా ప్రారంభమైందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామాన్ని నెల రోజుల పాటు నాలుగు విడతల్లో సందర్శించి, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపడతామని తహశీల్దార్ సుధీర్ వివరించారు. భూమి సమస్యలు, పట్టాదారు పాస్‌బుక్‌లు, టైటిల్ డీడ్‌లు, రికార్డుల సవరణ, సర్వే అంశాలు వంటి రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. మొదటి విడతలో భాగంగా తోటపల్లి గూడూరు మండలంలో గ్రామాల వారీగా గ్రామసభలు నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని తెలిపారు. డిసెంబర్ 16, 23, 30 తేదీల్లో ఉదయం 10:30 గంటల నుంచి సంబంధిత గ్రామాల్లో అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను నేరుగా తెలియజేయాలని తహశీల్దార్ కోరారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు పారదర్శక సేవలు అందించడమే లక్ష్యమని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చోటు చేసుకోదని తహశీల్దార్ సుధీర్ స్పష్టం చేశారు.

## దిత్వా తుఫాన్ బాధిత రైతులకు 80 సబ్సిడీ విత్తనాలు పంపిణీ



**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 15, ప్రభాతవార్త:** దేశానికి వెన్నెముకలైన రైతాంగ సంక్షేమానికి సర్వేపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కీలక కృషితో 80 శాతం సబ్సిడీపై విత్తనాలు అందుబాటులోకి వచ్చాయని సొసైటీ చైర్మన్ గూడూరు నారాయణ తెలిపారు. దిత్వా తుఫాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలకు కూటమి (టీడీపీ) ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. తోటపల్లి గూడూరు మండలంలోని పేడూరు రైతు సేవ కేంద్రంలో చైర్మన్ నారాయణ ఆధ్వర్యంలో దిత్వా తుఫాన్ బాధిత రైతులకు సబ్సిడీపై విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో మండలంలో సుమారు నాలుగు వేల ఎకరాల నారుమడులు దెబ్బతిన్నాయని చెప్పారు. బాధిత రైతులకు సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాల్లో విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సోమిరెడ్డి సహాయ సహకారాలతో కేఎన్ఎమ్ –1638, ఆర్ఎన్ఆర్–15048 విత్తనాలను 80 శాతం సబ్సిడీతో సుమారు 290 క్వింటాళ్ల మేరకు రైతులకు అందించనున్నట్లు వెల్లడించారు. నారుమడులు దెబ్బతిన్న రైతులు తమ గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా రైతు సేవ కేంద్రాలను సంప్రదించి విత్తనాలు పొందాలని గూడూరు నారాయణ సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, సోమిరెడ్డి రేవంత్ రెడ్డి, పంది రాధాకృష్ణయ్య, గండవరపు సోమశేఖర్, సంగారు శివయ్య, బద్వేల్ నవీన్, గ్రామ వ్యవసాయ సహాయకుడు జి. సుమంత్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీపొట్టి శ్రీరాములు వర్ధంతి



**అనుమసముద్రంపేట ,డిసెంబరు15ప్రభాతవార్త:** ఏఎస్‌పేట తహసిల్దార్ కార్యాలయంలో సోమ వారం అమరవీరులు శ్రీ పొట్టిశ్రీరాములు వర్ధంతి వేడుకలను తహసిల్దార్ కె.అనిల్‌కుమార్ ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్ర అవతర ణకోసం ఆయన చేసిన మహోన్నత త్యాగం, సేవలు చిరస్మరణీయమని తహసిల్దార్ కొనియాడారు. ఆయన ఆత్మబలిదానం వలనే ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం సాధ్యమైందని గుర్తుచేసుకుంటూ నేటి తరాలు ఆయన త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో డిటి వెంకటేశ్వర్లు, విఆర్ఒలు, కార్యాలయ సిబ్బంది , విఆర్ఎలు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలు శాశ్విత పరిష్కారానికి చర్యలు



**సైదాపురం, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** మండలంలో ఉన్న రెవెన్యూ సమస్యలు శాశ్విత పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని తహసీల్దార్ ఎం.సుభద్ర తెలిపారు. స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో గ్రీవెన్స్‌డే సందర్భంగా వివిధ సమస్యలపై సోమవారం ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ, భూ సమస్యలు తదితర సమస్యలు శాశ్వితంగా పరిష్కారం చేయడం జరుగుతుందని తెలిపారు. సమస్యల పరిష్కారంపై మంత్ వన్ విలేజ్– ఫోర్ విజిట్స్ పేరుతో డిసెంబర్ మాసం నుండి ప్రతి నెల ఒక గ్రామాన్ని నాలుగు పర్యాయాలుగా సందర్శించి ఆ గ్రామంలో ఉన్న అన్ని రెవెన్యూ సమస్యలపై సమీక్ష జరిపి ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించి త్వరితగతిన పరిష్కారం ప్రజల ముంగిటే చేయడం జరుగుతుందని తెలిపారు. ఆయా షెడ్యూల్ ప్రకారం మొదటగా మండల పరిధిలోని ఊటుకూరు గ్రామం నందు డిసెంబర్ నెలలో 13, 17, 24, 31వ తేదీలలో ఉదయం 10.30గంటల నుండి మండల స్థాయి అధికారులతో గ్రామ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## ఘనంగా శ్రీ పొట్టిశ్రీరాములు వర్ధంతి వేడుకలు



**మర్రిపాడు ,డిసెంబరు15ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మర్రిపాడు తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం శ్రీ పొట్టిశ్రీరాములు వర్ధంతి వేడుకలను తహసిల్దార్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తహసిల్దార్ పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన పొట్టిశ్రీరాములు ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం చేసిన సేవలను, ప్రాణత్యాగాన్ని గురించి వివరించారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ, విఆర్ఒలు, విఆర్ఎలు , కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సూరిశెట్టి వెంకటేశ్వరరావు మృతి బాధాకరం



**నెల్లూరు, డిసెంబర్ 15, ప్రభాతవార్త –వైద్యం :** నెల్లూరు నగరంలో విషాధం నెలకొంది. ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ సూరిశెట్టి నరేంద్ర తండ్రి సూరిశెట్టి వెంకటేశ్వరరావు అనారోగ్యం కారణంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వెంటనే రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నగరంలోని కాపు వీధిలోని వారి నివాసానికి చేరుకున్నారు. మృతదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలన్నారు. అనంతరం సూరిశెట్టి వెంకటేశ్వరరావు అంతిమయాత్రలో మంత్రి నారాయణ పాల్గొన్నారు. సూరిశెట్టి వారి కుటుంబం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అనేక మంచి కార్యక్రమాలు చేసిందని గుర్తు చేసుకున్నారు. సూరిశెట్టి వెంకటేశ్వరరావు చనిపోవడం చాలా బాధగా ఉందన్నారు. వారి కుటుంబానికి టీడీపీ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

## గొప్ప వ్యక్తులుగా తయారవుతారు



**నెల్లూరు, డిసెంబర్ 15, ప్రభాతవార్త –వైద్యం :** గర్భ సంస్కార వల్ల తల్లి సుఖంగా కాన్పు అవ్వడమే కాకుండా పుట్టబోయే బిడ్డలు గొప్ప వ్యక్తులుగా తయారవుతారని సింహపురి వైద్య సేవా సమితి వైస్ చైర్మన్ బాల సుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం జయ భారతి హాస్పిటల్ ప్రాంగణంలో గర్భిణీ స్త్రీలకు గర్భ సంస్కార కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భధారణ మహిళలకు జీవనశైలి ఆహార నియమాలు, మానసిక వికాసం, మంత్ర ధారణ, ఆసనాలు, గర్భ సంవాదం బిడ్డతో అనుబంధం అనేక అంశాలలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ శిక్షణ ద్వారా తల్లి సుఖ ప్రసవం అవ్వడానికి సాధారణ కాన్పు అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఇస్కాన్ దేవస్థానం ఇన్‌చార్జి డాక్టర్ సుఖదేవ స్వామి మాట్లాడుతూ సైన్స్ పరంగా గర్భ సంస్కార్ నిరూపితం అయిందన్నారు. పురాణ కాలంలో భక్త ప్రహ్లాదుడు, అభిమన్యుడు తల్లి గర్భంలో ఉండగానే వారు అనేక విషయాలు తల్లి ద్వారా ఆలకించి నిజజీవితంలో ప్రదర్శించడం జరిగిందన్నారు. జయ భారత్ హాస్పిటల్ యాజమాన్యం వారు ఇంతటి మంచి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇక మీదట ప్రతి మూడు నెలలకు ఒక సారి ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. గర్భవతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ప్రముఖ చిన్న పిల్లల డాక్టర్ వెన్నెల మాట్లాడుతూ ఆరు నెలల నుంచే బిడ్డలు తల్లులు చెప్పే విషయాలు ఆలకిస్తారని చెప్పారు. ప్రతి తల్లిగర్భంలో ఉన్న తన బిడ్డ కోసం మంచి సంగీతం, కథలు విషయాలు వినాలన్నారు. దీని వలన బిడ్డ ఆరోగ్యంగా పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ తల్లులు తీసుకోవాల్సిన ఆహార నియమాలు, జాగ్రత్తలు వివరించారు. ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రసవం తర్వాత బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని తప్పనిసరిగా ప్రతి తల్లి గర్భం దాల్చిన వెంటనే బిడ్డకు పాలు ఇవ్వాలని కోరిక కలగాలని తల్లిపాలు అమృతంతో సమానమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింహపురి వైద్య సేవ సమితి కోశాధికారి గుర్రం సుధాకర్, జయభారత్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ గురు ప్రసాద్, భగవాన్ మహవీర్ జైన్ చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి జెపి జైన్, డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ కార్యాలయంలో అమరజీవి వర్ధంతి వేడుకలు



**వింజమూరు, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** వింజమూరు ప్రాథమిక సహకార సంఘ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ ఆధ్వర్యంలో అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి తెలుగు భాష మాట్లాడే వారికి ప్రత్యేకమైన రాష్ట్రం కావాలని పోరాడినటు వంట యోధుడన్నారు. ఆయన ప్రాణత్యాగంతో ఈ రాష్ట్రం సాధ్య మైందని ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి ఆయన ఆశయ సాధనకు కృషి చేయడమేనన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ మేకల రమణయ్య, సిబ్బంది వై.శ్రీనివాసులురెడ్డి, రాధా, మణిరత్నం తదితరులు ఉన్నారు.

## ఏపీజీఈఏ కార్యవర్గ ఎన్నికలు



**వింజమూరు, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** వింజమూరు తాలూకా ఏపీజీ ఈఏ యూనిట్ ఎన్నికలు ఈ నెల 18వ తేదీన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి బి.కిరణ్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కార్యవర్గ ఎన్నికలతో పాటు సర్వసభ్య సమావేశం నిర్వహించబడుతుందన్నారు. వింజమూరు తాలూకా పరిధిలోని కొండాపురం కలిగిరి వింజమూరు మండలాలకు సంబంధించి ఏపీజీఈఏ సభ్యులు ప్రభుత్వ ఉద్యోగులు సమావేశానికి హాజరు కావానలి కోరారు. ప్రజాస్వామ్య ధోరణిలో ప్రతినిధులను ఎన్నుకోవాలని ఆయన సూచించారు. ఈ ఎన్నికలు సహాయ ఎన్నికల అధికారిగా వి.ఫణీంద్రబాబు వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంఘ సభ్యులు ఉన్నారు.

## పోలినేనిపాలెం వద్ద రోడ్డు ప్రమాదం



**వలేటివారిపాలెం, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** వలేటివారిపాలెం మండలంలోని పోలినేని వద్ద ఎదురెదురుగా వస్తూ రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ప్రమాదం జరిగింది. కందుకూరు మండలం చిన్న ఓగూరు గ్రామానికి చెందిన మనోజ్ కుమార్ వలేటివారిపాలెం జియో షోరూంలో పని చేయుటకు కందుకూరు వైపు నుంచి వస్తున్నారు. వినుకొండ మండలం నాగులవరం గ్రామానికి చెందిన శాంతిరాజ్ వ్యవసాయ పనులు నిమిత్తం వలేటివారిపాలెం నుండి జెడ్ ఉప్పలపాడు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న ఏఎస్సై బ్రహ్మయ్య తన సిబ్బందితో దగ్గరుండి సహాయక చర్యలు చేపట్టారు. అంబులెన్స్ కు ఫోన్ చేసి క్షతగాత్రులను కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఏఎస్సై బ్రహ్మయ్య మానవత్వం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ఆకట్టుకున్న భారీ ర్యాలీ



**కోవూరు, డిసెంబరు 15 ప్రభాత వార్త :** నెల్లూరులో సోమవారం నిర్వహించిన మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజపేయి విగ్రహావిష్కరణకు కోవూరు బీజేపీ అధ్యక్షులు పోలిశెట్టి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కోవూరు పురవీధుల్లో మోటార్ సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు బీజేపీ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ ర్యాలీలో పార్టీ నేతలు , కార్యకర్తలు ఉన్నారు.

## ప్రభుత్వ సెక్టార్ పరిధిలో ఉన్న బ్యాంకును ఏర్పాటు చేయాలి

**సైదాపురం, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మర్లపూడి గ్రామంలో ప్రభుత్వ సెక్టార్ పరిధిలో ఉన్న బ్యాంకును ఏర్పాటు చేయాలని టీడీపీ నాయకుడు వరదబండి వెంకటేశ్వర్లురెడ్డి నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతి పత్రం అందించారు. మండలంలోని మర్లపూడి, పోతేగుంట, కొమ్మిపాడు, కోమటిగుంటరాజుపాలెం, లింగన్నపాలెం, ఆర్‌వైజీపాలెం, చీకవోలు, పంచాయతీకి సంబంధించి ప్రజా ప్రతినిధుల తీర్మాణాలతో పాటు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అందించిన లెటర్‌తో కలెక్టర్‌కు వినతి అందించడం జరిగిందని వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. మర్లపూడి గ్రామంలో బ్యాంకు లేనందున పొదుపు మహిళలు, విద్యార్థులు, రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని జిల్లా కలెక్టర్‌ను మర్లపూడి గ్రామానికి బ్యాంకును ఏర్పాటు చేయాలని కోరారు.

## సైదాపురం మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని కలెక్టర్‌కు వినతి



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 15, ప్రభాతవార్త** సైదాపురం మండలాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేయకుండా నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని మండల టీడీపీ నాయకులు కందాటి దయాకర్‌రెడ్డి, నలమారు వెంకటేశ్వర్లురెడ్డి, వరదబండి వెంకటేశ్వ ర్లురెడ్డి తదితరులు నెల్లూరు కలెక్టర్ కార్యాల యం లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు సోమ వారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైదాపురం మండలాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేయడం వలన ప్రజలు అనేక ఇబ్బందులు పడతారని, తిరుపతికి వెళ్లాలంటే సుమారు 125 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాలని వారు తెలిపారు. నెల్లూరు జిల్లాలో సైదాపురాన్ని కొనసాగించడం వలన మాకు అన్నింటికి అనుకూలంగా ఉంటుందని కలెక్టర్‌ని కోరడం జరిగిందని వారు తెలిపారు.

## సమిష్టి కృషితో పల్స్ పోలియోను విజయవంతం చేయాలి



**కోవూరు, డిసెంబరు 15ప్రభాతవార్త :** కోవూరు మండలంలో ఈ నెల 21,22,23వ తేదీల్లో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమిష్టి కృషితో పూర్తిస్థాయిలో విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ నిరంజన్ అన్నారు. కోవూరులోని ఐసీడీఎస్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పల్స్ పోలియోపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఒక ప్రణాళికాబద్ధంగా నూరుశాతం పూర్తి చేయాలన్నారు. మొత్తం కోవూరు మండలంలో 70 బూత్‌లు, 7 రూట్లు 7432 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని తమదిగా భావించాలన్నారు. సీడీపీవో శారద మాటాడుతూ అంగన్‌వాడీ కార్య కర్తలు సమిష్టి కృషితో వారికి కేటాయించిన విధులు బాధ్యతలను సక్రమంగా నిర్వహించి శాఖకు మరింత పేరు తేవాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సీహెచ్ ప్రభావతి, సీహెచ్‌వో విజయమ్మ,సూప ర్‌వైజర్ ఇలియాజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రమీల, ఉమా, సుమిత్రలు పలు సూచనలు చేశారు.

## ఎంపీపీ వితరణ అభినందనీయం



**కోవూరు, డిసెంబరు 15ప్రభాతవార్త :** కోవూరు మండల పరిషత్ అధ్యక్షురాలు టి. పార్వతి పదవ తరగతి విద్యార్థులపై ఉన్న ప్రత్యేకమైన అబిమానంతో సోమవారం వంద రోజుల ప్రణాళికలో బాగంగా పదవ తరగతి విద్యార్థులకు బలవర్ధకమైన అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయి మాట్లాడుతూ ఇప్పటికే ఎంపీపీ ఈ పాఠశాలకు అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఇందుకు ఎంపీపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## సదరంకు వచ్చే వారు పూర్తి సమాచారంతో రావాలి



**కోవూరు, డిసెంబరు 15ప్రభాతవార్త :** కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న సదరం క్యాంపులకు వచ్చే వారు తప్పనిసరిగా వారి దగ్గర ఉన్న పూర్తి వివరాలతో కూడిన సమాచారంతో రావాలని వైద్యులు డాక్టర్ అమృత తెలిపారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సదరం క్యాంపులో ఆమె 17 మందికి వైద్య పరీక్షలు నిర్వమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సదరం క్యాంపుకు వచ్చే ప్రతి ఒక్కరూ వారి దగ్గర ఉన్న జెరాక్స్ కాపీలను తీసుకుని తప్పక హాజరు కావాలన్నారు.

## రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మావులూరును కలిసిన మండల నాయకులు



**ఇందుకూరుపేట, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కోవూరు మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర పీఏసీ సభ్యులు, నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి సహకారంతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఇందుకూరుపేట మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మావులూరు శ్రీనివాసులురెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన కుడితిపాలెం సర్పంచ్ నాయుడు సురేష్, మెట్ట వెంకటరామిరెడ్డి, సిగినం రవి, గొల్లపోతి నారాయణ, దేవిరెడ్డి భానురెడ్డి.

## హైవే రహదారిని పరిశీలించిన పోలీసు అధికారులు



**దగదర్తి, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** దగదర్తిలోని హైవే రహదారిని సోమవారం పోలీసు అధికారులు పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఏం చేయాలనే అంశంపై డీఎస్ శ్రీధర్, సీఐ పాపారావు, ఎస్సై జంపని కుమార్, బిట్రగుంట ఎస్సై ప్రభాకర్ కలిసి పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్న ప్రదేశాల్లో ఎందువల్ల జరుగుతున్నాయి, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఎలా ఆపాలి అనే అంశాలు ఎస్సై జంపని కుమార్ అధికారులకు చెప్పారు. క్రాస్ రోడ్ల వద్ద డ్రమ్ములు పెట్టాల్సిందిగా అధికారులు చెప్పడం జరిగిందని ఎస్సై తెలిపారు. వీరితో పాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

## బస్సుయాత్రకు అనుబంధంగా స్కూటర్ ర్యాలీ




**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** జాతీయ స్థాయి పిలుపులో భాగంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ నేతృత్వంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అటల్ మోడీ పరిపాలన బస్సు యాత్ర సోమవారం ఉదయం 9.30 గంటలకు నెల్లూరు చేరుకుంది. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ శ్రేణులు నగరంలోని అయ్యప్ప గుడి నుంచి భారీ బైక్ ర్యాలీని చేపట్టారు. ఈ యాత్ర నగరంలోని ప్రధాన రహదారిపై ప్రయాణించి కేవీఆర్ మీదుగా మినీ బైపాస్ నుంచి హరనాథపురం సెంటర్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో భారతీయ జనతా పార్టీ శ్రేణులు, కూటమి నేతలు కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. 11న ధర్మవరం నుంచి చేపట్టిన బస్సు యాత్ర సోమవారం నెల్లూరుకు చేరుకుంది. బహిరంగ సభ అనంతరం నెల్లూరు నుంచి సోమవారం సాయంత్రానికి ఒంగోలు చేరుకుంటుంది. యాత్ర ఈనెల 25న అమరావతి చేరుకొని అటల్ బిహారి వాజ్ పేయి విగ్రహావిష్కరణ బహిరంగ సభతో ముగుస్తుంది.

## ఘనంగా శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి నివాళులర్పించిన సోమిరెడ్డి



**నెల్లూరు, డిసెంబర్ 15, ప్రభాతవార్త –వైద్యం :** అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా నెల్లూరు వేదాయ పాలెంలోని కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళుల ర్పించిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజుల అమరణ దీక్షతో ప్రాణత్యాగం చేసిన మహానుభావుడు పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు. తెలుగు ప్రజలెవరూ పొట్టిశ్రీరాములుతో పాటు ఆయన ప్రాణత్యాగాన్ని మరిచిపోరు.

## మావులూరును సన్మానించిన గంగపట్నం నాయకులు



**ఇందుకూరుపేట, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట రాష్ట్ర రైతు విభాగం జనరల్ సెక్రటరీగా ఎన్నికైన సందర్భంగా సోమవారం మావులూరు శ్రీనివాసులురెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో గంగపట్నం నాయకులు సిగినం సుబ్రహ్మణ్యం, ఉదయాద్రి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ముస్లిం స్మశాన వాటికను శుభ్రం చేయించిన బిఎంఆర్ యువసేన అధ్యక్షులు సమీవుల్లా



**బిట్రగుంట డిసెంబర్ 15 ప్రభాతవార్త :** బోగోలు మండలం పంచాయతీలోని ఇబ్రహీంపేట జామియా మసీదుకు సంబంధించిన ముస్లిమ్స్ స్మశాన వాటిక లో చెట్లు మరియు చెత్తను బిఎంఆర్ యువసేన అధ్యక్షులు షేక్ షమీవుల్లా సోమవారం శుభ్రం చేశారు త్వరలో మొత్తం శుభ్రం చేయించి స్మశాన వాటికకు కాంపౌండ్ వాల్ కూడా కట్టడం జరుగుతుంది అని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో మొగల్ రఫీ రియాజ్ భాయ్ మాహిన్ తదితరులు పాల్గొన్నారు.

## బిట్రగుంట సబ్ పోస్ట్ ఆఫీస్ చిరునామా మార్పు



**బిట్రగుంట డిసెంబర్ 15 ప్రభాతవార్త :** బిట్రగుంట సబ్ పోస్ట్ ఆఫీస్ ను రైల్వే స్టేషన్ వద్ద గల రైల్వే క్వార్టర్స్ నుండి బోగోలు రాజ వీధిలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరం పక్కకు మార్చినట్లు పోస్టల్ అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు మార్చబడిన నూతన భవనం నుండి సేవలు అందుకోవాల్సిందిగా కోరారు

## టిడిపి కార్యకర్తల ఆత్మీయ సమావేశం




**సీతారామపురం డిసెంబర్ 15 ప్రభాతవార్త :** ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు సీతారామపురం మండల టిడిపి కన్వీనర్ చింతల శ్రీనివాసులు సూచనల ప్రకారం సోమవారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం ఆవరణంలో సీతారామపురం పంచాయితీ టిడిపి గ్రామ కమీటి అధ్యక్షులు పిడుగు రమేష్ అధ్యక్షతన టిడిపినాయకులు కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పంచాయితీకి సంబందించి సమస్యలను రాబోయే స్దానిక సంస్దల ఎన్నికల గురించి చర్చించారు. కార్యకర్తలు నాయకుల యొక్క అభిప్రాయాలను వారి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కొడవటి కంటి భాగ్యకుమారి, సొసైటీ ఛైర్మన్ సోమనబోయిన రాజశేఖర్, మండల టిడిపి మాజీ కన్వీనర్ వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి యూత్ కన్వీనర్ పసుపులేటి వికాస్ బాబు, జిల్లా తెలుగుయువత అధికార ప్రతినిధి సింగాల నాగేష్, నాయకులు ఏనుల సుబ్బారాయుడు, షేక్ బాబు, పెద్ద గౌస్, బాషా, తదితరులు పాల్గోన్నారు.

## అమరజీవికి నివాళులర్పించిన తహసిల్దారు,ఎంపిడిఒ



**బుచ్చి డిసెంబర్15 ప్రభాతవార్త :** అమరజీవి వర్దంతి పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాళెం తహసిల్దారు కార్యాలయంలో తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు, ఎంపిడిఒ రంతుల య్యా, డిప్యూటి తహసిల్దారు మల్లికార్జున, ఆర్ఐ శాంత కుమారి, ఎఎస్ం నన్నం శ్రీనివాసులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో తహసిల్దారు వెంకటేశ్వర్లు మాట్లాడుతు అమరజీవి త్యాగ ఫలమే నేడు బాషా సంయుక్త రాష్ట్రం అని అన్నారు. అటువంటి మహనీయుల్ని స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు అంటరాని తనంపైన కూడా పోరాటం చేశారని కొనియాడు. పట్టుదల గల ఇలాంటి మహనీయుల్ని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో విఆర్ఒలు, కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు



**కొడవలూరు, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** మహాత్మగాంధీ సిద్దాంతాల ప్రభాతంతో భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని ఉప్పుసత్యాగ్రహంలో, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న ధీరోదాత్తుడు, తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే దృడనిశ్చయంతో పోరాడి లక్ష్యం సాధించిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని స్థానిక తహశీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్థంతి వేడుకలు ఘనంగా జరిపారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రాణాలను కూడా లెక్కచేయని ఆయన త్యాగం మనలో స్ఫూర్తి నింపాలని తెలిపారు. బాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు తన ప్రాణత్యాగంతో నాంది పలికిన ఆ మహనీయుదును మరువలేమన్నారు. అంతుకుముందు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నమస్కరిస్తూ ఘన నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో డిటి సారంగపాణి, నాయకులు నాపా వెంకటేశ్వర్లునాయుడు, ఆర్ఐ హైమావతి, మండల విద్యాశాఖా అధికారిణి, వసంతకుమార్, ఏపిఎం క్రిష్ణవేణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ నిర్మల, విఆర్ఓలు పాల్గొన్నారు.

## నేడు గ్రామ సమస్యల పరిష్కార వేధిక



**విడవలూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త :** గ్రామ రెవెన్యూ ఇతర సమస్యలపై ప్రజలు శాశ్వత పరిష్కారం పొందుటకు గ్రామసభ వేధిక ఏర్పాటు చేయడంజరుగుతుందని తహశీల్దార్ కె.చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో ప్రతినెల ఒక్కో గ్రామంలో మూడు విడతలుగా ప్రజాపరిష్కార వేధిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటగా దండిగుంట గ్రామంలో నేడు, 23, 30వ తేదిల్లో మండలస్థాయి అధికారులచే ఏర్పాటు ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

## గ్రీవెన్స్‌డేకు ఐదు అర్జీలు



**కొడవలూరు, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజల సమస్యల ప్రజావేధిక పరిష్కార కార్యక్రమానికి మండల ప్రజలు పాల్గొని తహశీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డికి వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల వద్ద నుండి వచ్చిన అర్జీలను పూర్తి పరిశీలన చేసి సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులకు తెలియపరచి పరిష్కారం చేస్తామని అర్జీదారులకు తెలిపారు. విఆర్ఓలతో రెవెన్యూ సమస్యలపై సమీక్షించి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ సారంగపాణి, ఆర్ఐ హైమావతి, వివిధశాఖల అధికారులు క్రిష్ణవేణి, వసంతకుమారి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవికి వర్థంతి వేడుక



**విడవలూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త :** స్థానిక ఎంపిడిఓ, తహశీల్దార్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్థంతి వేడుకలు తహశీల్దార్ చంద్రశేఖర్ సూపరిండెంట్ వెంకట రమణమ్మ ఘనంగాజరిపారు. ఈస ందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రజల ఆశల కోసం అమరణ నిరాహారదీక్ష చేసి తన ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడిని మరువలేము. మనకు నిస్వార్థ సేవ, లక్ష్యసాధనలో దీక్ష, ్రజల కోసం అంకితభావం వంటి విలువలను నేర్పుతుంది. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సీనియర్, జూనియర్, అసిస్టెంట్లు రాజ్యలక్ష్మి, ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు అండగా రత్నం పాఠశాల విద్యార్థులు



**కావలి, డిసెంబర్ 15 ప్రభాతవార్త :** డాక్టర్ కిషోర్స్ రత్నం స్కూల్‌లో నిర్వహించే యాన్యువల్ కమ్యూనిటి సర్వీస్ హ్యాండ్స్ టు హ్యాఫీనెస్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల డైరెక్టర్ కె.క్రిష్ణ కిశోర్, వాసంతి కిషోర్ ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తుఫాన్ నగర్‌లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో వృద్దులకు నిత్యవసర వస్తువులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంయుక్త సేవా సంస్థ సభ్యులు ఎంవిఎన్ ప్రసాద్‌రావు, ఎం అజిత్‌బాబు, షేక్ ఖాదర్‌బాషాలు పాల్గొని మాట్లాడారు. వృద్దులకు అవసరమైన నిత్యవసర వస్తువులు, బియ్యం తినుబండారాలను అందజేసిన కిశోర్ రత్నం పాఠశాల యాజమాన్యాన్ని, విద్యార్థులను అభినందించడం జరిగిందన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంలో పాటు సామాజిక సేవలపై అవగాహన కల్పించడం గొప్ప విషయం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ పొట్టి శ్రీరాములు ఆశయాలను కొనసాగించాలి

**కావలి, డిసెంబర్ 15 ప్రభాతవార్త :** అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని కావలి తహశీల్దార్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. కావలి పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం నందు సోమవారం తహశీల్దార్ శ్రావన్‌కుమార్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. తెలుగువారి కోసం ప్రత్యేక రాష్ట్ర సాదనకు 56రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి రాష్ట్రాన్ని సాధించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్య వివాహ ముక్తా భారత్‌పై అవగాహన కార్యక్రమం



**నెల్లూరు సిటీ, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా కస్తూర్బా గాంధీ బాలికల హై స్కూల్ నందు మహిళా శిశు సంక్షేమ శాఖ బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహ ముక్తా భారత పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో బాలికలకు ఐసిపిఎస్‌పిఒ సిహెచ్ సమత మాట్లాడుతూ బాలలకి ఎటువంటి ఇబ్బంది కలిగిన 1098కి కాల్ చేయాలని ఏదైనా సమస్య వస్తే 112 కాల్ చేయాలని, బాలికలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి రావాలని పాజిటివ్ థింకింగ్ గురించి బాల్య వివాహ నిరోధక చట్టం 2006 గురించి బాల్య వివాహం వల్ల కలుగు నష్టాలు గురించి నష్టాలు గురించి బాలలపై జరిగే వేధింపులు గురించి బాలనుకున్న హక్కుల గురించి పిల్లలకి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ విభాగం నుండి సిహెచ్ సమత సుమ, మహిళ పోలీస్ విభాగం నుండి ఏఎస్ఐ, శ్రీహరి, సతీష్ బాబు, స్కూల్ హెచ్ఎం, స్కూల్ టీచర్లు పాల్గొన్నారు. అనంతరం పిల్లలందరితో ప్రతిజ్ఞ చేయించారు.

## వక్కబోర్డ్ స్థలం ఆక్రమణ పై చర్యలు తీసోకండి



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా రాపూరు పట్టణంలో గల వాక్ఫర్డ్ స్థలం ఆక్రమించుకున్నారని సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో జరిగిన ప్రజా విజ్ఞప్తుల దినంలో కలెక్టర్ శుక్లాకు ఆ గ్రామానికి చెందిన షేక్ సైదా సాహెబ్ సయ్యద్ ముతహర్‌లో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న శ్రీనివాసులు అనే వ్యక్తి వక్కబ్బోర్డ్ స్థలం పేర్కొన్న జెండా మాను స్థలంలో హిందూ ముస్లిం తేడా లేకుండా పూజలు నిర్వహించుకుంటా మన్నారు. మాసూంసా వలికొండ ఉరుసును కూడా ఈ స్థలంలో నిర్వహించుకుంటామన్నారు. పంచాయితీ అధికారుల అండదండలతో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న శ్రీనివాసులు పై విచారణ జరిపి ఆక్రమణ స్థలమును హిందూ, ముస్లిం పవిత్ర స్థలంగా భావించి విడిపించాలని కలెక్టర్‌ను కోరామన్నారు.

## చింతలపాలెం పంచాయితీని యధావిధిగా కొనసాగించండి కలెక్టర్‌కు వినతి



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా కలువాయి మండలం చింతలపాలెం పంచాయతీని వేరే పంచాయితీలో విలీనం చేయకుండా యధావిధిగా కొనసాగించాలని మజారా గ్రామమైన వెంకటరామరాజుపేట గ్రామానికి చెందిన ఎస్కె సందాని పలువురు గ్రామస్తులతో కలిసి సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో జరిగిన ప్రజా విజ్ఞప్తుల దినంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ 1150 ఓట్ల ఉన్న ఈ పంచాయతీని గ్రామస్తులకు తెలియకుండా ఫోర్జరీ సంతకాలతో విలీనం చేయాలని సంతకాలు జరిపి పంచాయతీ విలీనానికి పైరవీలు చేస్తున్నారన్నారు. పంచాయితీ తీర్మానం ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని చింతలపాలెం పంచాయితీ యధావిధిగా కొనసాగించాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్కె మస్తాన్, బండా రమేష్, గోవర్ధన్, దండా చిన్న, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవి వర్ధంతి వేడుకలు



**వింజమూరు, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** వింజమూరు పంచాయతీ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ ఎన్.సుజనా, డిప్యూటీ ఎంపీడీవో కే.రామారావుల ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. మన జిల్లా వాసులు అంతటి ఘన కార్యాన్ని సాధించడం మన అదృష్టమని వారన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు ఎన్.రాయుడు, చంద్ర రాము, భువన వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## అమరజీవికి ఘన నివాళులు



**కోవూరు, డిసెంబరు 15 ప్రభాతవార్త :** ఆంధ్రరాష్ట్ర సమపార్జన కోసం ప్రాణాలను సైతం త్యజించిన పొట్టి శ్రీరాములును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి తెలిపారు. కోవూరులోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలోకార్యాలయ పర్యవేక్షకులు ఉషారాణి, డిప్యూటీ ఎంపీఈవో సురేష్, జూనియర్ అసిస్టెంట్ రాధ, టైపిస్ట్ సురేష్, పీ-4 ఉద్యోగులు, సబార్డినేట్‌లు ఉన్నారు.

## శ్రీపొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు




**కోవూరు, డిసెంబరు 15 ప్రభాతవార్త :** ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరజీవిగా నిలిచిన శ్రీ పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ బషీర్ తెలిపారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం శ్రీ పొట్టి శ్రీరాములు వర్థంతిని పురస్కరించుకుని ఆత్మార్పణ దినాన్ని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. స్వాతంత్ర్య భారత దేశ సాధనకై గాంధీ మహాత్ముడు చూపిన అహింసా మార్గంలో పయనించిన మహనీయులు పొట్టి శ్రీరాములు అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్‌లు సతీష్, రమేష్, మధుసూదన్‌రావు, సర్వేయర్ రమేష్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనాథ్; రమణయ్య, ఉద్యోగులు ఉన్నారు.

## నేడు గంగవరంలో గ్రామసభ



**కోవూరు, డిసెంబరు 15ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, ఇతర సమస్యల శాశ్వత పరిష్కారం కోఒరకు డిసెంబర్ నెలలో ఒక గ్రామం నాలుగు పర్యాయాలు సందర్శించాలని ఆదేశాలు ఇచ్చారని, ఈ మేరకు మంగళవారం కోవూరు మండలం గంగవరం గ్రామంలో గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కోవూరు మండలంలో తొలి విడతగా గంగవరం గ్రామం ఎంపిక చేసుకోవడం జరిగిందని, ఆ గ్రామంలో ఉన్న రెవెన్యూకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే వాటిని సంబంధిత రైతుల ద్వారా దరఖాస్తులు స్వీకరించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందుకు గానూ గ్రామంలో ఉన్న రైతులు రెవెన్యూ పరమైన సమస్యలు ఏమైనా ఉంటే దరఖాస్తులతో గ్రామసభకు వస్తే వాటిని పరిశీలించి తగు పరిష్కారం చూపుతామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఆయుర్వేద ఆసుపత్రిలో సర్వే



**కోవూరు, డిసెంబరు 15ప్రభాతవార్త :** కోవూరులోని కొత్తూరు రోడ్డులో ఉన్న ఆయుర్వేద ఆసుపత్రి పున:నిర్మానానికి గానూ ఏపీఎం ఐడీఏసీ ఏఈ నాగ తదితర అధికారుల బృందం ఈ ఆసుపత్రిలో సర్వే కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుతం ఈ భవనం పరిస్థితి ఏమిటి, మరలా నూతన భవన నిర్మాణానికి ఎంతమేర స్థలం అవసరం అవుతుంది అనే విషయాలపై వచ్చిన ఏఈ బృందం నిశిత పరిశీలన చేపట్టారు. పూర్తిస్థాయిలో చేపట్టిన ఈ నివేదికను జిల్లా అధికారులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద కాంపౌండర్లు శివశంకర్, మల్లయ్య, తదితరులు ఉన్నారు.

## స్వచ్ఛదంగా ఆక్రమణలు తొలగించండి ..లేకుంటే మేమే తొలగిస్తాం



**రాపూరు, డిసెంబరు15ప్రభాతవార్త :** రాపూరు పాత బస్టాండ్‌లో దుకాణాదారులు వారి దుకాణాల ముందు వున్న ఆక్రమణలు స్వచ్ఛందంగా వారే తొలగించుకోవాలని లేని పక్షంలో తాము తొలగిస్తామని రాపూరు ఎస్ఐ యం.వెంకట రాజేష్, పంచాయితీ కార్యదర్శి అట్ల కవితాలు దుకాణ దారులను హెచ్చరించారు. రాపూరు మెయిన్ రోడ్డు నుండి పెంచలకోనకు వెళ్లే పాత బస్టాండ్‌లో సివికె ప్రభుత్వ జూనియర్ కళాశాల గోడకు ఆక్రమించి దుకాణాలు నిర్మించుకోని వున్న దుకాణదారులు ఆక్రమణలకు హద్దేలేదు అన్నట్లుగా ఆక్రమణ దుకాణాలకు ముందు మరలా పైపులు నాటి పందిరిలు వేసుకుంటున్నారు. దీంతో ఈ దారిలో ఒక్క వాహనం వెల్లాలన్నా కూడా ఇబ్బంది కరంగా మారింది. దీంతో పలువురు ఈ అక్రమణలపై అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎస్ఐ, పంచాయితీ కార్యదర్శిలు దుకాణాల ముందు రోడ్డుపై అడ్డంగా ఆక్రమించిన గుంజలను, రోడ్డుకు ఇబ్బంది కరంగా దుకాణాల ముందు కట్టిన మెట్లను పరిశీలించి వెంటనే దుకాణాల ముందు వున్న అక్రమణలు తొలగించాలని మార్కింగ్ వేశారు. దుకాణదారులు మార్కింగ్ వరకు స్వచ్ఛందంగా రెండు రోజులలో అక్రమణలు తొలగించాలని లేని పక్షంలో తామే మొత్తం ఆక్రమణలు తొలగిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. వీరి వెంట స్థానిక సర్పంచ్ భూపతి జయమ్మ వున్నారు.

## డిగ్రీ విద్యార్థులచే నవాబుపేటలో పరిసరాల పరిశుభ్రత



**రాపూరు, డిసెంబరు15ప్రభాతవార్త :** రాపూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో బాగంగా నవాబుపేట ఎస్సీ కాలనీలోని పాఠశాలలో పరిసరాలను సోమవారం పరిశుభ్రం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమంతయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మల్లిఖార్జున ,మోహన రావుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధనకు ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపతానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సామాజిక సేవ అవశ్యకతను విద్యార్దులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూపతి జయమ్మ, పంచాయితీ కార్యదర్శి కృష్ణ చైతన్య, స్కూల్ హెడ్మిస్ ప్రమీలా కళాశాల ఆధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గోన్నారు.

## ర్యాలీకి వెళ్లిన వైసీపీ నేతలు



**బిట్రగుంట డిసెంబర్ 15 ప్రభాతవార్త :** ప్రభుత్వ మెడికల్ కాలేజీలు పీపీపీ విధానంలో ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు కావలి నియోజకవర్గం ఇంచార్జి రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు బోగోలు మండలం నుండి నెల్లూరు లో జరిగే ర్యాలీ కి మండలం నుండి మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘుయాదవ్ ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు సోమవారం ప్రత్యేక వాహనాలలో తరలి వెళ్లారు

## గూడూరుని నెల్లూరులో కలపాలి



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** గూడూరును నెల్లూరు జిల్లా పరిధిలోనే కలపాలని గూడూరు బిజెపి నేతలు తో కలిసి మిడతల రమేష్, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జడ్పీ సీఈఒ శ్రీధర్ రెడ్డికు విజ్ఞప్తి చేశారు. 355 సంవత్సరాలకు పైగా నెల్లూరు పరిధిలో ఉన్న గూడూరును జగన్ సర్కార్ విడదీసినప్పుడు ప్రజా వ్యతిరేకత వచ్చింది. ఎస్సీలకు చట్టసభల్లో ప్రాతినిధ్యంగా ఎస్సీ రిజర్వుడు గూడూరును నెల్లూరులోనే కొనసాగించాలి. గూడూరు నుంచి నెల్లూరు తక్కువ దూరంలో ఉండగా, గూడూరు నుండి తిరుపతికి దూరం ఎక్కువగా ఉన్నందున రవాణాభారం ప్రయాణభారం మూడు లక్షల మంది ప్రజలపై పడుతుంది. నెల్లూరు కోస్తా ప్రాంత జీవన విధానము బాంధవ్యాలకు గూడూరు ప్రజలు మిళితమయమై ఉన్నారు. కూటమి ప్రభుత్వ నేతగా ఎన్నికలలో గూడూరును నెల్లూరులో కలుపుతామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు మాట తప్పి ప్రజలను మనోవేదనకు గురి చేశారు గూడూరు ప్రజల అభిప్రాయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి వివరించాలని జడ్పీ సీఈఓ కు గూడూరు బిజెపి నేతలు సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పనబాక కోటేశ్వరరావు దువ్వూరు గిరిధర్ రెడ్డి, పాదర్తి కోటారెడ్డి, పమంజి కృష్ణయ్య, నరాల సుబ్బారెడ్డి, యాకసిరి గోపాల్ రెడ్డి, ఓజిలి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డేలో ఎస్పీకి బాధితుల మొర



**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 15, ప్రభాతవార్త:** జిల్లా పోలీసు కార్యాలయం నందు సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన బాధితులు తమ ఫిర్యాదులను జిల్లా ఎస్పీ అజిత వేజెండ్లకు అందచేశారు. ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించి, సంబంధిత పోలీసు అధికారులతో స్వయ ంగా ఫిర్యాదుదారులను మాట్లాడించి, వారికి తక్షణమే ఉపశమనం కలిగించే విధంగా తగిన చర్యలు తీసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదని, ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటీషన్లను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, చట్టపరిధిలో పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 114 ఫిర్యాదులు వచ్చాయి. ఆత్మకూరుకి చెందిన వ్యక్తికి, వాట్స్ యాప్ ద్వారా పరిచయమై, ఆన్ లైన్‌లో బిట్ కాయిన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి చేయడం ద్వారా అధిక నగదు సంపాదించవచ్చని ఆశ చూపి రూ.11,65,771 పెట్టుబడి పెట్టించి, నగదు తిరిగి ఇవ్వకుండా మోసం చేశారని, మోసపోయానని, విచారించి న్యాయం చేయాలని కోరారు. ఇందుకూరుపేటకి చెందిన మహిళ, తన ఇద్దరు కుమారులకు ఆస్తి పంపకాలన్నీ సమానంగా చేసినట్లు, తమ నివాసం కోసం చిన్న ఇంట్లో ఉంటున్నట్లు, తన పెద్ద కుమారుడు కోడలు ఆ ఇంటిని కూడా ఇవ్వాలని ఇంటి నుండి వెళ్లిపోవాలని తనని, తన భర్తను బెదిరిస్తూ మానసికంగా వేధిస్తున్నారని విచారించి న్యాయం చేయాలని కోరారు. వెంకటాచల సత్రంకి చెందినటువంటి మహిళను, తన భర్త అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, తన జీవనాధారం కూడా కష్టంగా ఉందని అదేవిధంగా బిట్రగుంటకి చెందిన మహిళ భర్త మరణాంతరం తన అత్త ఆడపడుచులు కొట్టి ఇంటి నుండి తరిమివేశారని, తనకు ముగ్గురు ఆడపిల్లలని, జీవనాధారం కూడా కష్టంగా ఉందని, విచారించి న్యాయం చేయాలని కోరారు. ఈ పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్బి డిఎస్పి శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, డిసిఆర్‌బి సీఐ రామారావు, మహిళా స్టేషన్ సీఐ సుబ్బారావు, వెల్ఫేర్ ఆర్ఐ రాజారావు, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం మత్తులో యువకుల వీరంగం

**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** మద్యం మత్తులో కొందరు యువకులు వీరంగం సృష్టించిన సంఘటన స్థానిక వనంతోపు సెంటర్లో చోటు చేసుకుంది. ఏకంగా పోలీసులపైనే దౌర్జన్యం చేసే పరిస్థితి ఏర్పడింది. పోలీసుల కథనం మేరకు కొందరు యువకులు ఫుటుగా మద్యం సేవించి, వనంతోపు కూడలిలోని ఓ ఫ్రైడ్ రైస్ దుకాణం వద్ద నూడిల్స్ తిని డబ్బులు ఇవ్వకుండా వారి పైన దౌర్జన్యానికి దిగారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. క్రమంలో అక్కడ నుంచి బైక్‌పై వేగంగా వెళ్తూ ఓ వృద్ధుడ్ని ఢీకొట్టారు. దీంతో వృద్ధుని బంధువులు, స్థానికులు యువకుల పై దాడి చేశారు. వెంటనే జరిగిన సంఘటనను తమ పెద్దలకు యువకులు ఫోన్ ద్వారా తెలపడంతో వారు కూడా అక్కడ చేరుకుని స్థానికులతో గొడవకు దిగారు. ఈ క్రమంలో అడుగా వెళ్తున్న బాలాజీ నగర్ సిఐ సాంబశివరావు సంఘటనను గమనించి ఘర్షణను నిలువురించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో మత్తులో ఉన్న యువకులు వారికి సహకారంగా వచ్చిన వారు కూడా పోలీసులపై దౌర్జన్యానికి దిగారు. ఇందుకు కారణమైన కామయ్య, సుశాంత్, శ్రీకాంత్ అనే వ్యక్తులను వేదయపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## పొదలకూరులో 'అమరజీవి"కి ఆర్యవైశ్యులు ఘన నివాళి



**పొదలకూరు, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** పొదలకూరు పట్టణంలోని పంచాయితీ బస్టాండ్ వెలుపల ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పట్టణ ఆర్యవైశ్యులు పూలమాలలు వేసి సోమవారం ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పొదలకూరు మండల టిడిపి వాణిజ్య సంఘం అధ్యక్షులు, పొదలకూరు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మీరా మధు, అమర్తలూరు చెంచయ్య, పొట్టి సుధాకర్, రాజా సురేంద్ర, తన్నీరు సురేష్ బాబు, పైడా కామేష్‌లు ఆయన కీర్తిని కొనియాడారు. వీరితో పాటు పొదలకూరు పట్టణ, మండల నెల్లూరు జిల్లా ఆర్య వైశ్య సంఘం నాయకులు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వర్ధంతి కార్యక్రమంలో వక్తల ప్రసంగాల అనంతరం పండ్లు, కేకులు, బిస్కెట్లు పంచి పెట్టారు.

